## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి : సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి సూచించారు. జిల్లా కలెక్టరేట్ సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆమె జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దరఖాస్తు దారుల నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు.

ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చేసి అర్జీలను అందజేస్తారని ఆ అర్జీలను సంబంధితశాఖ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్జల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. 168 దరఖాస్తులను స్వీకరించినట్లు కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిఆర్వో నాగరాజమ్మ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్, వివిధశాఖ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## రాష్ట్రవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలి

**జోగిపేట, అక్టోబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎర్రోళ్ల మహేష్ అన్నారు. ఈనెల 30న నిర్వహించనున్న రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేసేందుకుగాను సోమవారం జోగిపేటలో ఎస్ఎఫ్ఐ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా 8 వేల కోట్ల స్కాలర్‌షిప్స్, ఫీజు రీఇంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆరు నెలల క్రితం బంద్ నిర్వహిస్తే రాష్ట్రప్రభుత్వం రూ.1200 కోట్లు రెండు దఫాలుగా విడుదల చేస్తామని చెప్పి మోసం చేసిందని విమర్శించారు. దీనివల్ల ప్రైవేటు కళాశాలల్లో చదివిన విద్యార్థులు సర్టిఫికెట్స్ అడిగితే ప్రభుత్వం నుంచి బకాయిలు రాలేదని, అందుకని డబ్బులుకట్టి సర్టిఫికెట్లు తీసుకెళ్లాలంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం వెంటనే విద్యార్థుల పరిస్థితి అర్థం చేసుకొని వెంటనే స్కాలర్‌షిప్స్, ఫీజు రీఇంబర్స్‌మెంట్ నిధులు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో రవి, అనిల్, ప్రసాద్, పవన్, నవీన్ పాల్గొన్నారు.



మద్యం షాపుల లక్కీ డ్రాలో పాల్గొన్న కలెక్టర్, డిప్యూటీ కమిషనర్‌లు

## పారదర్శకంగా మద్యం దుకాణాల కేటాయింపు

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ, అక్టోబరు 27,ప్రభాతవార్త:** నూతన ఎక్సైజ్ పాలసీ నిబంధనలను అనుసరిస్తూ సంగారెడ్డి జిల్లాలోని మద్యం దుకాణాల కేటాయింపును పూర్తిగా పారదర్శకంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. జిల్లాలో 2025 2027 సంవత్సరం వరకు కొనసాగనున్న మద్యం దుకాణాల లైసెన్సుల కేటాయింపు ప్రక్రియ సోమవారం సంగారెడ్డి పట్టణంలోని జెఎస్ఆర్ గార్డెన్‌లో లాటరీపద్ధతిలో లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 101 మద్యం షాపుల కేటాయింపుకుగాను 4,432 దరఖాస్తులు అందాయి. 100 మద్యం షాపులకు సంబంధించి ఒక్కో షాపు వారీగా దరఖాస్తు దారులను ఆహ్వానించి, వారి సమక్షంలో లక్కీ డ్రా నిర్వహించారు. 100 షాపుల కేటాయింపు పూర్తయిందని, ఈ కార్యక్రమం మొత్తం ఫోటో, వీడియో చిత్రీకరణతో సజావుగా జరిగినట్లు కలెక్టర్ తెలిపారు. షాపు నంబర్-24 కు సంబంధించి తక్కువ దరఖాస్తులు అందిన నేపథ్యంలో, ఎక్సైజ్ శాఖ ఆదేశాల మేరకు రీ-నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈక్రమంలో పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులు హాజరుకావడంతో టోకెన్ కలిగిన వారిని మాత్రమే లోపలికి అనుమతించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణలో మద్యం దుకాణాల కేటాయింపు లక్కీ డ్రా ప్రశాంతంగా కొనసాగింది. కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జె. హరికిషన్, సూపరింటెండెంట్ నవీన్ చంద్ర, ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## అధికారులు రాక వెలవెలబోయిన 'ప్రజావాణి'




నాగల్‌గిద్ద ప్రజావాణి కార్యక్రమంలో కానరాని అధికారులు

**నాగల్‌గిద్ద, అక్టోబరు 27, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి అధికారులురాక వెలవెలబోయింది. మధ్యాహ్నం 12 గంటలైనా తహసీల్దార్‌తో పాటు ఆయా శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా అధికారులు కార్యక్రమానికి దూరంగా ఉండటంతో ప్రజావాణి వెలవెల బోయింది. ప్రజావాణిలో సమస్యల పరిష్కారం అవుతాయని ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఆయా గ్రామస్థులు వెనుదిరిగి పోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రజావాణి కార్యక్రమానికి అధికారులురాకపోవడాన్ని 'ప్రభాతవార్త' ఫోన్‌లో తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా తను సబ్ కలెక్టర్ వద్ద సమావేశంలో ఉన్నట్లు మధ్యాహ్నం 1 గంటకు కార్యాలయానికి చేరుకుని ఒక ఫిర్యాదును స్వీకరించినట్లు వివరణ ఇచ్చారు.

## మెదక్ పట్టణంలో బైక్ ర్యాలీ



ర్యాలీలో బైక్ నడిపిస్తున్న అదనపు ఎస్పి మహేందర్

**మెదక్ టౌన్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** జిల్లా పోలీస్ కార్యాలయం నుండి రాందాస్ చౌరస్తా మీదుగా వెల్కమ్ బోర్డు వరకు ప్రారంభమైన భారీ బైక్ ర్యాలీ, తిరిగి రాందాస్ చౌరస్తా వద్ద ముగిసింది. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, ఆదేశాల మేరకు, మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ, మెదక్ జిల్లాలో విధి నిర్వహణలో 14 మంది పోలీసులు ప్రాణాలు అర్పించారు. అదేవిధంగా, ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా సెంట్రల్ మరియు రాష్ట్ర పోలీస్ విభాగాల 191 మంది సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించారు. ఈ బైక్ ర్యాలీ ద్వారా మన అమరవీరులను స్మరించుకుంటూ, వారి త్యాగం వెళకట్టలేనిదని గుర్తుచేసుకుంటు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీ రంగా నాయక్, మెదక్ టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్, ఎస్బీ ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది మరియు స్థానిక యువత పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో ఘనంగా ఛట్ పూజ

**సంగారెడ్డి మున్సిపాలిటీ అక్టోబరు 27, ప్రభాతవార్త :** సంగారెడ్డి సమీపంలోని మహబూబ్ సాగర్ చెరువు వద్ద సోమవారం నిర్వహించిన చట్ పూజ కార్యక్రమంలో ఎస్పీ పారితోష్ పంకజ్ దంపతులు హాజరై పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం నాలుగు రోజులపాటు జరిగేలో కార్యక్రమంలో భాగంగా సోమవారం చెరువు వద్ద నిర్వహించిన పూజ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై పూజలో పాల్గొన్నారు. వీరితోపాటు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. చట్ పూజ కార్యక్రమం నాలుగు రోజులపాటు జరుగుతుందని, వివిధ కార్యక్రమాలతో పాటు ప్రత్యేక పూజలు కూడా ఉంటాయని చట్ పూజ ప్రభారి బసంత్ సింగ్ సోలంకి తెలిపారు.



చట్ పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ దంపతులు

# మద్యం దుకాణాల లైసెన్సుల జారీకి లక్కీడ్రా

### ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా కొనసాగిన లక్కీడ్రా

**మెదక్ టౌన్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** మద్యం దుకాణాల లైసెన్సుల జారీ కోసం సోమవారం మెదక్ బోధన్‌రోడ్‌లోని వెంకటేశ్వర గార్డెన్‌లో లాటరీ పద్దతిలో వైన్ షాపుల కేటాయింపునకు లక్కీ డ్రా నిర్వహించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ నేతృత్వంలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా సాఫీగా ఈ ప్రక్రియ కొనసాగింది. నూతన ఎక్సయిజ్ పాలసీ నియమ, నిబంధనలను అనుసరిస్తూ ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పక్కాగా ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని 49 మద్యం షాపులకుగాను 1420 దరఖాస్తులు దాఖలయ్యాయి. ఒక్కో షాపుకు దాఖలైన దరఖాస్తులకు సంబంధించిన వారిని ఆహ్వానిస్తూ, వారి సమక్షంలో కలెక్టర్ రాహుల్‌రాజ్ లక్కీ డ్రా తీస్తూ మద్యం దుకాణాల కేటాయింపును ఖరారు చేశారు. లక్కీ డ్రా కోసం వినియోగించిన టోకెన్‌లను అందరికీ చూపిస్తూ, పారదర్శకంగా డ్రా నిర్వహించారు. ఎలాంటి అనుమానాలకు ఆస్కారం లేకుండా లక్కీ డ్రా ప్రక్రియ ప్రారంభం నుండి చివరి వరకు ఫోటో, వీడియో చిత్రీకరణ జరిపించారు. పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులు హాజరుకావడంతో టోకెన్ ఉన్నవారినే లోనికి అనుమతించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా వెంకటేశ్వర గార్డెన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోనూ కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అదనపు ఎస్పీ మహేందర్, డిఎస్‌పి ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును పర్యవేక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు. లక్కీ డ్రాలో అదృష్టం వరించి వైన్ షాపులు



లక్కీ డ్రా తీస్తున్న మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

కేటాయించబడిన వారు నిబంధనలను అనుసరిస్తూ, లైసెన్స్ ఫీజు రూపేణా నిర్ణీత రుసుము చెల్లించేందుకు వీలుగా వేదిక వద్దనే అవసరమైన ఏర్పాట్లు కల్పించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఇతర అధికారుల పర్యవేక్షణలో మద్యం దుకాణాల కేటాయింపు లక్కీ డ్రా ప్రశాంతంగా కొనసాగింది. ఈసందర్భంగా లాటరీ ప్రక్రియ కొనసాగించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మీడియాతో మాట్లాడుతూ మెదక్ జిల్లాలో మొత్తం 49 మద్యం షాపులు ఉన్నాయని మెదక్ వెంకటేశ్వర గార్డెన్లో అత్యంత పారదర్శకంగా ఫొటోగ్రఫీ వీడియోగ్రఫీ ద్వారా లక్కీ డ్రా తీయడం జరిగిందన్నారు. ఇందులో రిజర్వేషన్ ప్రాతిపదికలో భాగంగాగాను ఎస్టీ 1, ఎస్సీ 6, గౌడ కులానికి సంబంధించి 9 మొత్తం 16 షాపులు కేటాయించామన్నారు. మిగతా 33 షాపులు అన్ రిజర్వ్ కింద కేటాయించడం జరిగిందన్నారు. ఇందులో 18 షాపులకు మహిళలు లాటరీ గెలుచుకోగా, 31 షాపులకు పురుషులు దక్కించుకోవడం జరిగిందన్నారు. మద్యం టెండర్లు దక్కించుకున్న వారు డిసెంబర్ ఒకటో తేదీనుంచి మద్యం షాపులు కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఆయిల్‌పామ్ సాగు విస్తరణ లక్ష్యం సాధించాలి

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ అక్టోబర్ 27, ప్రభాతవార్త:** జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేసేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సంవత్సరానికిగాను 3,750 ఎకరాల ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని సాధించేందుకు వ్యవసాయ విస్తరణ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులకు అర్హత ప్రకారం ప్రోత్సాహకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ సూక్ష్మ నీటి సేద్యం, సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, జాతీయ వెదురుమిషన్, వర్షాధార ప్రాంతాల అభివృద్ధి పథకం వంటి పథకాల అమలు ప్రగతిని సమీక్షించారు. ప్రతిపథకం రైతులస్థాయిలో ఫలితాలను ఇవ్వాలంటే సమయపాలనతో పాటు సాంకేతిక మార్గదర్శకాల ప్రకారం వ్యవసాయ విస్తరణ ఉండాలన్నారు. ఆయిల్ పామ్ సాగు జిల్లాలో ఆదాయాన్ని పెంచే పంటగా మారేలా అన్ని విభాగాల అధికారులు సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఆయిల్‌పామ్ సాగు విస్తరణలో భాగంగా గోద్రెజ్ ఆగ్రోవేట్ ఆధ్వర్యంలో మండల వారీగా రైతుల అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి సి.హెచ్. పండరి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఏడీఎస్ అధికారులు, ఉద్యాన విభాగ సిబ్బంది, గోద్రెజ్ ఆగ్రోవేట్ జనరల్ మేనేజర్ స్వీటీ వేగుంట, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య




## సిపిఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి

### -జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

**సంగారెడ్డి టౌన్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు సిపిఆర్‌పై అవగాహన ఉండాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం సంగారెడ్డిలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి అధికారులకు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ అకస్మాత్తుగా వచ్చే గుండెపోటుతో సంభవించే మరణాలను సిపిఆర్‌తో నిలువరించవచ్చన్నారు. అత్యవసర సమయాల్లో వెంటనే స్పందించేందుకు ప్రతి ఒక్కరు అవగాహన పొంది ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా సిపిఆర్ పద్దతులను గుండె మసాజ్, కృత్రిమ శ్వాస పద్దతులపై వైద్యులు డాక్టర్ శశికిరణ్, డాక్టర్ దీప్తి, డాక్టర్ జైపాల్‌లు ప్రత్యక్షంగా ప్రదర్శించి సభికులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ పద్మజ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగ నిర్మల, ఆయా శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలకు సత్వర న్యాయం అందించాలి

### మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబరు 27 ప్రభాతవార్త :** పేదలకు సత్వర న్యాయం అందించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవోలుగా సూచించారు. సోమవారం మెదక్ జిల్లా పరిషత్ కార్యాలయంలో మెదక్ జిల్లాకు నూతన ఎంపీడీవోలుగా ఎంపికైన ఏడుగురు బాధ్యతలు స్వీకరణ కార్యక్రమంలో కలెక్టర్ హాజరయ్యారు. వారితో సమావేశమై సలహాలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల అభివృద్ధిలో ఎంపీడీవోలు పాత్ర కీలకంగా ఉంటుందని, పారదర్శక పాలనే లక్ష్యంగా ముందుకు పోతూ ప్రభుత్వ ఆదేశాలు పాటిస్తూ విధులు నిర్వహించాలని సూచించారు.



నూతన ఎంపీడీవోలతో సమావేశమైన మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

# సిద్దిపేట జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపు

### జిల్లాలోని 93 దుకాణాలను లక్కీడ్రా ద్వారా కేటాయించిన అధికారులు.. లక్కు తగిలిన 20 మంది మహిళలు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

జిల్లాలో 93 వైన్స్‌లకుగానూ ఈనెల చివరి తేదీ 23 వరకు 2782 ఆశావహులు అప్లికేషన్లు దాఖలు చేశారు. 93 వైన్స్‌లలో 9 ఎస్సీలకు, 16 గౌడ్స్, మిగితా 63 జనరల్‌కు కేటాయించారు. ఈసారి మద్యం దుకాణాలను దక్కించుకోవడానికి ఆశావహులు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లాలోని సిద్దిపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 805, గజ్వేల్ 810, హుస్నాబాద్ 508, చేర్యాల 416, మిరుదొడ్డి 243 చొప్పున అప్లికేషన్లు దాఖాలు కావడంతో జిల్లా కేంద్రంలోని సీసీ గార్డెన్‌లో సోమవారం జిల్లా కలెక్టర్ కట్ట హైమావతి, ఎక్సైజ్ అధికారుల సమక్షంలో లక్కీ డ్రా నిర్వహించారు. దరఖాస్తులు చేసుకున్న ఆశావహులు జిల్లా కేంద్రంలోని సీసీ గార్డెన్‌కు భారీగా తరలివచ్చారు. ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ హైమావతి, ఎక్సైజ్ అధికారులతో లక్కీ డ్రా ద్వారా మద్యం దుకాణాలను కేటాయించారు. దుకాణాలు దక్కిన వారు సంతోషంగా వెళ్లిపోగా దుకాణాలు దక్కని ఆశావహులు నిరాశతో వెనుదిరిగారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు లక్కీ డ్రా నిర్వహించారు. జిల్లాలోని 93 మద్యం దుకాణాలలో 20 మంది మహిళలకు లక్కీ డ్రా ద్వారా అదృష్టం కలిసివచ్చింది. కొత్త దుకాణాలను నడుపుకోవడానికి 2025 డిసెంబర్ 1 నుంచి 2027 సెప్టెంబర్ వరకు లైసెన్స్ జారీ చేస్తారు. లక్కీ డ్రాలో దుకాణాలు పొందిన వారు ఈనెల 28లోగా 1/6 వంతున లైసెన్స్ ఫీజు ప్రభుత్వ ఖజానాకు చెల్లించాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి తెలిపారు. కార్యక్రమంలో సీఐలు, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




లక్కీ డ్రా తీస్తున్న సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి, ఎక్సైజ్ అధికారులు



పోలీసు స్టేషన్ తనిఖీ చేస్తున్న సీపీ విజయ్‌కుమార్

## గంజాయి రహిత జిల్లాగా సిద్దిపేటను తీర్చిదిద్దుకుందాం : సిపి విజయ్‌కుమార్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి కృషిచేయాలని సీపీ విజయ్ కుమార్ ఆదేశించారు. జిల్లాలోని బేగంపేట, రాయపోల్, దౌల్తాబాద్, తొగుట, కుకునూర్‌పల్లి పోలీసు స్టేషన్లతోపాటు తొగుట సర్కిల్ కార్యాలయాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. చట్ట వ్యతిరేకమైన అసాంఘీక కార్యక్రమాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. మైనర్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, వితౌట్ డ్రైవింగ్ లైసెన్ నడిపే వాహనాదారులపై దృష్టి సారించాలన్నారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. గ్రామాలలో ప్రజలతో స్నేహపూర్వకమైన సంబంధాలు కొనసాగించాలన్నారు. ప్రజల రక్షణ ధ్యేయంగా విధులు నిర్వహించి మన్ననలు పొందాలన్నారు. స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు. జూదం,పేకాటపై ప్రత్యేక నిఘా పెట్టి సాములంగా నిర్మూలించాలన్నారు. పోలీసు స్టేషన్ చుట్టూ పరిసర ప్రాంతాలు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రతి పోలీసుస్టేషన్‌లో సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మల్లన్నసాగర్ ప్రాజెక్టు, టన్నెల్ సందర్శించారు. ఆయా కార్యక్రమాలలో పోలీసు అధికారులు నరసింహులు, లతీఫ్, మహిపాల్‌రెడ్డి, మానస, అరుణ్‌కుమార్, రవికాంత్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి

**సంగారెడ్డి మున్సిపాలిటీ అక్టోబరు 27, ప్రభాతవార్త :**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని అధికారులకు అదనపు కలెక్టర్(రెవెన్యూ) మాధురి అన్నారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణికి 59 దరఖాస్తులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్‌పాటు నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా అధికారులు ప్రజావాణి దరఖాస్తులు స్వీకరించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆర్టీసి బస్సు ఢీకొని మృతి చెందిన గొర్రెలు

## ఆర్టీసీ బస్సు ఢీకొని 20 గొర్రెలు మృతి

**కొల్చారం, అక్టోబరు 27(ప్రభాతవార్త):** హైదరాబాద్ మెదక్ రహదారిపై కొల్చారం శివారులోని లోతు వాగు సమీపంలో సోమవారం ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. డ్రైవర్ నిరక్ష్యంతో గొర్రెల మంద పైకి బస్సును పోనీయడంతో 22 గొర్రెలు అక్కడికక్కడ మృతి చెందాయి. ఎస్సై అహ్మద్ మోహియుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం నారాయణపేట జిల్లా, జాజాపూర్ గ్రామానికి చెందిన జంబనోళ్ల నర్సింలు ఇంకా కొంతమంది గొర్రెల కాపరులతో కలిసి తమ గొర్రెలను పటాన్‌చెరు నుంచి కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి వైపు వస్తుండగా కొల్చారం శివారులోని లోతు వాగు మూలమలుపు దాటి రాగానే హైదరాబాద్ నుంచి మెదక్ వస్తున్న ఆర్టీసీ బస్సు వెనుక వైపు నుంచి వేగంగా వచ్చి గొర్ల మంద పైకి దూసుకు వెళ్ళింది. దీంతో 22 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. సుమారు రెండు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు తెలిపారు. జంబనోళ్ల నరసింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, జెసిబి సీజ్

**చిన్నశంకరంపేట, అక్టోబరు 27,ప్రభాతవార్త:** మట్టిని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు, జెసిబిని సీజ్ చేసినట్లు ఏఎస్ఐ విఠల్ సోమవారం తెలిపారు. మండల పరిధి సంగాయపల్లి వద్ద అక్రమంగా మట్టిని తరలిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించి రెండు ట్రాక్టర్లు, ఒక జెసిబిని సీజ్ చేసి చిన్నశంకరంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. ట్రాక్టర్,జెసిబి యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

### సిద్దిపేట మండలంలో...

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 27, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మిట్టపల్లి శివారులోగల సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మోడల్ వెంచర్ ప్రభుత్వ భూమి నుంచి ఎలాంటి అనుమతి లేకుండా కొంత మంది టిప్పర్లలో హిటాచి ద్వారా మట్టిని నింపుతూ రవాణా చేస్తున్నారని వచ్చిన సమాచారంలో త్రీ టౌన్ ఎస్ఐ మల్లేశం దాడి చేశారు. ఈసందర్భంగా అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్, హిటాచిలను స్వాధీనం చేసుకున్నారు. టిప్పర్ల డ్రైవర్లు, హిటాచి ఆపరేటర్ కోరెం తిరుపతి, బోదాస్ నర్సింలు, రేపాక రాజులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా వంగ ప్రవీణ్‌రెడ్డి ఆర్చ్ ఫార్మా పక్కన గల వెంచర్‌లో మట్టి పోయిస్తున్నాడని తెలిపినట్లు తెలిపారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్.ఐ.మల్లేశం వివరించారు.




అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసిన పోలీసులు

## శ్రీరామకోటి ఆధ్వర్యంలో మహాశివునికి ప్రత్యేకపూజలు



శివలింగానికి అభిషేకం చేస్తున్న రామరాజు దంపతులు

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 27 (ప్రభాతవార్త):**
కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా శ్రీ రామకోటి భక్త సమాజం సంస్థ ఆధ్వర్యంలో అద్దాల మందిరం వద్ద మహాశివునికి భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు దంపతులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ పరమశివునికి అత్యంత ప్రీతికరమైన మాసం కార్తీకమాసం అని, ఈ మాసంలో వ్రతాలు, పూజలు, ఉపవాసాలు, వనభోజనాలు భక్తితో చేసుకోవాలన్నారు.

## చిన్నపాటి చెరువులా పాఠశాల మైదానం

**-ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు-పట్టింపులేని అధికారులు**



పాఠశాల ఆవరణలో నీటిచి వర్షపు నీరు

**కోహెడ, అక్టోబరు 27, ప్రభాతవార్త :**
మండల కేంద్రంలోని కోహెడ ప్రాథమిక పాఠశాల ఆవరణలో వర్షాలకు వరద నీరు చేరింది. రోజులు గడుస్తున్న కొద్ది నిలిచిన నీటిలో క్రిమికీటకాలు వృద్ధి చెంది దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో పాఠశాలకు విద్యార్థులు ఆ నీళ్లలోనే నడిచి వెళుతూ ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలిచి ఆ స్కూల్ గ్రౌండ్ చిన్నపాటి చెరువును తలపిస్తోంది. రాకపోకలకు విద్యార్థులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.నీటిని తోడేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## చేర్యాల నూతన ఎంపిడివోకు సన్మానం



నూతన ఎంపిడీవోను సన్మానిస్తున్న అధికారులు,సిబ్బంది

**చేర్యాల,అక్టోబర్ 27,ప్రభాతవార్త**
చేర్యాల నూతన ఎంపిడీవోగా అనబేరి ప్రణయ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు.గతంలో ఇంచార్జ్ ఎంపిడీవోగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌తో పాటు ఎంపివో విజయ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ బాలక్రిష్ణ, సిబ్బంది ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఇంచార్జ్ ఎంపిడీవోగా కొనసాగిన శ్రీనివాస్‌ను బదిలీ చేస్తారా లేక ఇక్కడే బాధ్యతలు అప్పగిస్తారన్నది తెలియాల్సి ఉంది.

## నంగునూర్ ఎంపిడిఓగా మహబూబ్ అలీ

**నంగునూర్, అక్టోబర్ 27, ప్రభాతవార్త :**
మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎండి.మహబూబ్ అలీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు విధులు నిర్వహించిన వేణుగోపాల్ స్టేట్ హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ అయ్యారు. సిద్దిపేట రూరల్ ఎంపిడివోగా పని చేస్తున్న ఎం.డి.మహబూబ్ అలీని నంగునూర్‌కు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన ఎంపిడిఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అధికారులు, సిబ్బంది నూతన ఎంపిడిఓను ఘనంగా సత్కరించారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**-గజ్వేల్ సిఐ రవికుమార్**




విద్యార్థినిలకు అవగాహన కల్పిస్తున్న సిఐ రవికుమార్

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 27 (ప్రభాతవార్త):**
ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని గజ్వేల్ సిఐ రవికుమార్ సూచించారు. సోమవారం కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గజ్వేల్ పట్టణంలోని ఎడ్యుకేషన్‌హబ్‌లోగల మహిళా డిగ్రీకళాశాలలో విద్యార్థినిలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ రవికుమార్ మాట్లాడుతూ మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థినిల, మహిళల పట్ల ఎవరైనా అమర్యాదగా ప్రవర్తించినా, ఈవిటీజింగ్‌కు పాల్పడినా చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగు తుందన్నారు. విద్యార్థులు మత్తుపదార్థాల జోలికి వెళ్ళి జీవితాలను నాశనం చేసుకోవద్దని, మంచిగా చదువుకొని ఉన్నతులుగా రాణించాలన్నారు. తల్లిదండ్రులు కష్టపడి మిమ్మల్ని చదివిస్తున్నారని, వారినమ్మకాన్ని వమ్ముచేయకుండా భవిష్యత్తులో రాణించాలన్నారు. ట్రాఫిక్ సిఐ మురళి మాట్లాడుతూ మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరమని, తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలను ఇచ్చి ప్రమాదాలను కొనితెచ్చుకోవదన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉమారాణి, అధ్యాపకులు, షీటీమ్ సిబ్బంది ఏఎస్ఐ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## అర్థిక సహాయం అందించిన చిన్ననాటి స్నేహితులు

**కొండపాక, అక్టోబర్ 27, ప్రభాతవార్త**
అపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన చిన్ననాటి స్నేహితులు. వివరాలు రిమ్మానగూడ గ్రామానికి చెందిన గజ్జె కిషన్ అత్మహత్య చేసుకొని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 2008,2009 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన తోటి స్నేహితులు కలిసి కిషన్ భార్యను ఓదార్చి అమెకు రూ॥ 20 వేలను అర్థిక సహాయంగా అందించారు. ఈ సందర్భంగా మంగోల్ మాజీ సర్పంచ్ కిరణ్ కుమార్‌చారి మాట్లాడుతూ తమ చిన్ననాటి స్నేహితుడు మృతి చెందడం బాధగా ఉందని, అతని కుటుంబనికి అండగా నిలువాలనే ఉద్దేశ్యంతో స్నేహితులందరం కలిసి అర్థిక సహాయం అందిచడం జరిగిందని తెలిపారు. అపదలో ఉన్నవారిని అదుకోవడంలోనే అత్మ సంతృప్తి కలుగుతుందన్నారు.

# ధాన్యం కొనుగోలు పూర్తయ్యేవరకు పర్యవేక్షణ చేయాలి

**-మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్**



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబరు 27, ప్రభాతవార్త:**
ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు పక్కాగా కార్యచరణ రూపొందించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సోమవారం మెదక్ మండలం రాయనపల్లి గ్రామంలో ఐకెపి ధాన్యం కొన్నిగోలు సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ అన్నదాతలు ఎంతో శ్రమించి పండించిన ధాన్యానికి మద్దతుధర కల్పించి, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కేంద్రాలకు వచ్చే చివరి గింజను కొనుగోలు చేసేందుకు జిల్లా లో498 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అధికారులు కేంద్రాలను పర్యవేక్షణ చేస్తారని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు పక్కాగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గన్ని బ్యాగులు, తేమ కొలిచే యంత్రాలు, తూకం యంత్రాలు, రైతులకు కనీసం మౌలిక వసతులు, లోడింగ్ అన్ లోడింగ్‌లో జాప్యం రాకుండా తగు రవాణా సదుపాయాలు మొదలగునవన్నీ ప్రతి కొనుగోలు కేంద్రంలో అందుబాటులో ఉండేవిధంగా అధికారులను ఆదేశించామన్నారు. ఏరోజుకారోజు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, వాటి వివరాలను రిజిస్టర్‌లో, ట్యాబ్‌లో నమోదు చేసి వీలైనంత త్వరగా రైతుల ఖాతాలో నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌వెంట అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మల్లంరాజు విగ్రహానికి నివాళులర్పించిన ఎంపి



మల్లం రాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఈటల రాజేందర్

**గజ్వేల్, అక్టోబరు 27 (ప్రభాతవార్త):**
గజ్వేల్ మండలం కొల్గూరు గ్రామంలో సోమవారం ఆ గ్రామ మాజీ సర్పంచ్ దివంగత మల్లం రాజు ప్రథమ వర్థంతి సందర్భంగా ఆయన విగ్రహానికి బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకుడు, మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మల్లం రాజు సతీమణి సుమతి, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, బిజెపి నాయకులు శశిధర్‌రెడ్డి, బారు అరవింద్, లక్ష్మణ్‌గౌడ్, అశోక్‌గౌడ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్ పట్టణంలో సైకిల్ ర్యాలీ




గజ్వేల్‌లో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, విద్యార్థులు

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 27 (ప్రభాతవార్త):**
పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం గజ్వేల్ పట్టణంలోని సిఐలు రవికుమార్, ముత్యంరాజు, ట్రాఫిక్ సిఐ మురళిల ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పట్టణ పురవీధుల గుండా అమరవీరులను స్మరించుకుంటూ సైకిల్ ర్యాలీని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలకు ముగ్గుల పోటీలు



మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 27, ప్రభాతవార్త :**
సిద్దిపేట అర్బన్ మండల సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం నష ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం మహిళ సంఘం సభ్యులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ రాజేష్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల బలోపేతానికి ప్రభుత్వం కృషి

**కొడంగల్,అక్టోబరు 27, ప్రభాతవార్త:**
అంగన్‌వాడీల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని,అందులో భాగంగా అంగన్‌వాడీల స్వంత భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరీ చేయడం జరుగుతుందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నందారం ప్రశాంత్,మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అన్నారు.సోమవారం పట్టణంలోని 12వ వార్డులో రూ.20లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

## మల్లన్న సన్నిధిలో ఘనంగా కార్తీక దీపోత్సవం



మల్లన్న సన్నిధిలో కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, అక్టోబరు 27, ప్రభాతవార్త :**
మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో కార్తీక శుద్ధ షష్టి, కార్తీక సోమవారం సందర్భంగా శ్రీస్వామివారి మహామండపం ఆవరణలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీవారిచే భజన కార్యక్రమం గావించి సహస్రదీపోత్సవం జరిపించారు. దీపోత్సవ కార్యక్రమంలో గ్రామస్థులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. కార్యనిర్వాహనాధికారి వెంకటేష్, ఆలయ ఎఈఓ, పర్యవేక్షకులు, సిబ్బంది ఆలయ అర్చకులు, భక్తులకు దీపపు ప్రమిదలు, పూజ సామాగ్రి అందజేశారు. అనంతరం ఆలయ అర్చకులు దీపోత్సవంలో పాల్గొన్న సువాసినులకు ప్రసాద తాంబూలములను అందజేసి ఆశీర్వదించారు.

## ప్రహరీ గోడ నిర్మాణాన్ని నిలిపివేయమని కలెక్టర్‌కు ఫిర్యాదు

**-మాజీ సర్పంచ్ మేడిపల్లి మురళి**



జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేస్తున్న మేడిపల్లి మురళి దృశ్యం

**గుమ్మడిదల, అక్టోబరు 27, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం వార్డులో జరుగుతున్న ఆక్రమాలపై మాజీ సర్పంచ్ మేడిపల్లి మురళి సోమవారం రోజున జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రజావాణిలో పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నారం వార్డులో ప్రభుత్వ సర్వే నంబర్ 261 గల భూమిలో సుమారు 150 ఎకరాల భూమికి ఎలాంటి అనుమతులు లేకుండా "అన్నోర ఫార్మసి" పరిశ్రమవారు చుట్టూ ప్రహరీ గోడ నిర్మిస్తున్నారు, ఈ భూమిలో ఒక కాలనీ ఉంది. కాలనీలో సుమారు 150 కుటుంబాలు బతుకుతున్నాయి. గ్రామానికి సంబంధించిన శ్మశానవాటిక, అసైన్ భూమి, రైతుల భూములు, ఉన్నాయి. వారి పొలాల్లోకి వెళ్లాలంటే శ్మశానవాటిక నుండి ఉన్న దారిలోనే వెళ్లాలి. అలాంటి దారిని అక్రమంగా మూసివేస్తూ ప్రహరీ గోడ నిర్మిస్తున్నారు. స్థానికనాయకులు, రైతులు ఇదేంటి అనిప్రశ్నిస్తే గూండాలనిపెట్టి భయాందోళనకు గురిచేస్తూ భయపెట్టిస్తున్నారనీ అన్నారు. స్థానిక తహసీల్దార్‌కు, మున్సిపల్ కమిషనర్‌కు పలుమార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదుచేసినట్లు తెలిపారు. అన్నారంగ్రామం వార్డులో జరుగుతున్న ఆక్రమ నిర్మాణాలపై వాటిని నిర్మిస్తున్న అన్నోరా ఫార్మాసి పరిశ్రమపై చట్టరీత్యా చర్యలు తీసుకొని, అక్రమంగా నిర్మిస్తున్న ప్రహరీ గోడను నిలిపివేసి ప్రభుత్వ భూమిని రైతుల భూమిని కాపాడి గ్రామానికి న్యాయం చేయాలని కలెక్టర్‌ని కోరినట్లు తెలిపారు.

## గెలుపే లక్ష్యంగా పని చేద్దాం

**షాద్‌నగర్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** ఉప ఎన్నికలలో భాగంగా రహమ్మత్ నగర్ లో బిజెపి అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి ఎన్నికల ప్రాచారంలో భాగంగా బిజెపి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్, బిజెపి సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, దేపల్లి అశోక్ గౌడ్, అండాపురం నర్సింహా గౌడ్ పాల్గొనడం జరిగింది. కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు బిజెపి నాయకులు అత్తాపురం మహేందర్ రెడ్డి, వడ్ల అరవింద్ చారి, రణదీర్ గౌడ్, విజయ్ బాస్కర్ రెడ్డి, జగన్, మల్లేష్, ప్రభాకర్ చారి, మరియు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తన్నుకు పోతున్న ప్రైవేటు వ్యాపారస్థులు

**-సోయాబీన్ ధరలు లేక అల్లాడుతున్న రైతులు**



పంటలను ఆరబెడుతున్న రైతులు

**కంగ్టి, అక్టోబరు 27, ప్రభాతవార్త:**
కంగ్టి మండలంలోని ఆయాగ్రామాలలో సుమారు 6500ఎకరాల్లో సోయాబీన్ పంటను రైతులు సాగుచేశారు. మండలంలోని నేలలు (భూమి) సోయాబీన్ పంటకు మాత్రమే అనుకూలంగా ఉందని, ఇది తప్ప వేరే మార్గంలేదని రైతులు నిరాశ చెందుతున్నారు. ప్రభుత్వం నిర్దేశిత ధర రూ.5300కు కొనుగోలుచేస్తుందని ప్రకటించినప్పటికీ, ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు నిరాశచెందుతున్నారు. ఆరుగాలం శ్రమించిన పంటకు సరైనధర ప్రైవేట్ వ్యాపారస్థులు రూ.3000 నుండి రూ.4000 వరకు మాత్రమే కొనుగోలుచేస్తున్నారని వాపోతున్నారు. మాబతుకులు మారేదెప్పుడని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఈ ఏడాదిలో అధికవర్షాలు కురవడంవల్ల పంట దెబ్బతిని దిగుబడి ఆశించినంత రాలేదని దిగాలుచెందారు. పంటలు కోత కొచ్చి రెండువారాలు దాటింది. కొందరు పంట రాశులు కూడా చేశారు. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర మార్కెట్ కొనుగోలు కేంద్రం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. అలాగే కంగ్టిలో మార్కెట్ యార్డు గిడ్డంగి గోదాం కోట్లు వెచ్చించి నిర్మించారు. కానీ ఇక్కడి రైతులకు ఏమాత్రం ఉపయోగానికి నోచుకోకుండా నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదనతో తెలిపారు. అందుబాటులో మార్కెట్ గోదాం ఉండి కూడా ఇతరత్రా మండలంలోని మార్కెట్ సుమారు 60 కిలోమీటర్లు దూరానికివెళ్లి అమ్మిన సంఘటనలు ఉన్నాయని నిరాశ చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి, రైతులకు అందుబాటులో కంగ్టి లోనే కొనుగోలుకేంద్రం ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు.

## సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలి

**-సిపిఎం పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి బి.నాగేశ్వరరావు**



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

**పటాన్‌చెరు, అక్టోబరు 27, ప్రభాతవార్త:**
ఇస్నాపూర్ మున్సిపల్ తేజా కాలనీలో వెంటనే సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలనీ సిపిఎం పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి బి.నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం పార్టీ పటాన్‌చెరు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గత 15 సంవత్సరాల క్రితం తేజా కాలనీ ఏర్పడిందని, కానీ ఇప్పటివరకు మౌలిక సదుపాయాలను కల్పించడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. కాలనీలో ఇంటర్నల్ సిసి రోడ్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వర్షంపడినప్పుడు గుంతలలో నీరు నిలవడంతో ప్రజలు ఎటువైపువెళ్ళాలో అర్థంకాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇస్నాపూర్ మున్సిపల్‌లో కోట్ల రూపాయల ఆదాయం ఉన్న ఎందుకు సిసి రోడ్ల నిర్మాణం చేపట్టడం లేదని ప్రశ్నించారు. వెంటనే ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని తేజా కాలనీ, లక్ష్మీనగర్, కావ్య కాలనీ, ఇందిరమ్మ కాలనీ, ఓడిఎఫ్ కాలనీలలో ఇంటర్నల్ సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే తేజా కాలనీ గేటు వద్ద ఉన్న వైన్స్ షాప్ వల్ల ప్రజలకు ఇబ్బందికరంగా మారిందని సెకండ్ షిఫ్టు, నైట్ షిఫ్ట్ వెళ్లే సందర్భంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాలనీ లోపలికి వెళ్లే డివైడర్ మధ్యన మందుబాబులు కూర్చొని దర్జాగా మందు తాగుతుండడం వల్ల కాలనీకి వెళ్లేవాళ్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నల్లగండ్ల రాజు, నారాయణ, నర్సింలు, యాదగిరి, కృష్ణలు, తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలి

**-ఎబివిపి రాష్ట్ర నాయకుడు బండారి ప్రశాంత్**

**రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబరు 27, ప్రభాతవార్త:**
అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి) రామాయంపేట శాఖ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా బండారి ప్రశాంత్ మాట్లాడుతూ రామాయంపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పడి మూడు సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకు కళాశాలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు విద్యను కొనసాగించలేకపోతున్నారని అన్నారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేక సెకండియర్, థర్డ్ ఇయర్ చదివే విద్యార్థులు బయట కూర్చునే పరిస్థితి రామాయంపేట డిగ్రీ కళాశాలలో ఏర్పడిందని అన్నారు.వెంటనే స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, అలాగే విద్యాధికారులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పైన దృష్టి సారించి వెంటనే సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. పరిష్కారం అయ్యేంతవరకు ఎబివిపి ఉద్యమాన్ని ఉద్రిక్తం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో నగర సంయుక్త కార్యదర్శి అర్జున్, ఆదర్శ్, కళాశాల అధ్యక్షులు దీక్షిత్, కార్యకర్తలు శివ, కిరణ్, భరత్, నవదీప్, భరత్ సింగ్, నవదీప్, ప్రశాంత్, రోహిత్, సన్నీ, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలను త్వరగా పరిష్కరించాలి

**-జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్**

**వికారాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదుల ౧ సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 106 ఫిర్యాదులు వచ్చాయని ఆయన తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యల ౧ అదనపు కలెక్టర్ సుధీర్‌తో పాటు డిఆర్ఓ మంగీలాల్‌కు విన్నవిస్తూ ఫిర్యాదులు సమర్పించినట్లు పేర్కొన్నారు. అట్టి ఫిర్యాదుల ౧ పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యల ౧ సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. భూ సమస్యలు, ఇతర సమస్యలపై సంబంధించి ఫిర్యాదులు వచ్చాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీపీఓ జయసుధ, ఆర్డీవో వాసుచంద్ర పాల్గొన్నారు.

## పోయిన సెల్‌ఫోన్లు అందజేత

**పెద్దేముల్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** పోయిన సెల్‌ఫోన్‌లను తిరిగి బాధితులకు ఎస్ఐ వేణుకుమార్ అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వేణుకుమార్ మాట్లాడుతూ కొన్ని రోజుల క్రితం 7 సెల్‌ఫోన్‌లు పోయాయని ఫిర్యాదు రాగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మిస్సింగ్ నమోదు చేశామని అన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా లోకేషన్ తెలుసుకొని వాటిని రికవర్ చేసి 7 సెలఫోన్‌లను ఫిర్యాదుదారులకు సోమవారం అందజేసినట్లు తెలిపారు. సెల్‌ఫోన్ పోయిన బాధితులు సీఈఐఆర్ పోర్టల్‌ను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## కనబడకుండా పోయిన వృద్ధురాలు

**మొయినాబాద్, అక్టోబరు 27 ప్రభాతవార్త :**
రెడ్డిపల్లికి చెందిన కోండకళ్ళు మంగమ్మ యొక్క తల్లి కనబడకుండా పోయిన సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తేది 27.10.2025 నాడు మేడిపల్లి గ్రామానికి చెందిన కె.మంగమ్మ, భర్త, పాండు, తన తల్లి కనబటంలేదని ఫిర్యాదు చేయడం జరిగిందని, ఫిర్యాదు దారుడు తెలిపిన వివరాల ప్రకారం తేది 24.10.2025 ఉదయం సుమారు 5:30 గంటల సమయంలో ఆమె తల్లి కావలి గండమ్మ (71) వృత్తి గృహిణి, బస్సులో ఇంటినుండి బయటకువెళ్లి తిరిగి ఇంటికిరాలేదని తెలిపారు, ఫిర్యాదుదారాలు తెలిసిన వాళ్ళ తన తల్లి చిల్కూర్ బాలాజి టెంపుల్ వద్ద భిక్షాటన చేస్తూ కనబడిందని చెప్పగా, వెంటనే అక్కడికి వెళ్లి చూసినా ఆమె తల్లిని కనిపించలేదన్నారు. అప్పుడప్పుడు, ఎన్కెపల్లి, చేవెళ్ళ ప్రాంతాలకు డబ్బులు కోసం వెల్లి సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చేదని అలాగే ఆమె మానసికంగా పరిస్థితి సరిగ్గాలేదని, తెలిపారు, ఇంటి నుండి వెళ్లినప్పుడు ఆమె తల్లి అయిన గండమ్మ గోధుమ రంగు స్వెట్టర్ ధరించి ఉందని, తెల్లని జుట్టు, చామనఛాయ రంగు ఉంటుందని తెలుపగా ఇట్టి విషయంపై పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు,

## గీతంలో మాలిక్యులర్ మోడలింగ్‌పై కార్యశాల

**-ప్రధాన శిక్షకుడిగా అడ్వెంట్ ఇన్ఫర్మేటిక్స్ సీనియర్ అప్లికేషన్ సైంటిస్ట్ డాక్టర్ షంషైర్ సింగ్ సర్దార్**

**పటాన్‌చెరు, అక్టోబరు 27, ప్రభాతవార్త:**
గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ ఫార్మసీ, హైదరాబాదులోని పరిశోధనా స్కాలర్లు, బి.ఫార్మసీ చివరి ఏడాది విద్యార్థుల కోసం మాలిక్యులర్ మోడలింగ్, వర్చువల్ స్క్రీనింగ్ అనే అంశంపై రెండు రోజుల ఆచరణాత్మక వర్క్ షాపును ప్రారంభించింది. పూణేలోని అడ్వెంట్ ఇన్ఫర్మేటిక్స్ సీనియర్ అప్లికేషన్ సైంటిస్ట్ డాక్టర్ షంషైర్ సింగ్ సర్దార్ ఈ కార్యశాలకు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. మాలిక్యులర్ మోడలింగ్, ఔషధ పరిశోధన కోసం సమగ్ర వేదిక అయిన మోల్ సాఫ్ట్ ఐసీఎం గురించి ఆయన లోతైన పరిచయాన్ని అందించారు. మోల్ సాఫ్ట్ పరిణామ క్రమం, దాని ప్రపంచ, జాతీయ వినియోగాదారుల వివరాలు, ఐసీఎం ప్రో ఫంక్షనాలిటీలు, పాకెట్ డిసిప్లే (చిన్న ప్రదర్శన), ఐసీఎంవీఎల్ఎస్, 3డి లిగాండ్ ఎడిటర్ పరిచయం, అధునాతన ఏఐఎంఎల్ ఆధారిత సాధానాలు వంటి కీలక అంశాలను ఆయన వివరించారు. త్వరలో నిర్వహించనున్న మోల్ సాఫ్ట్ ఇండియా యూజీఎం 2025లో పాల్గొనమని విద్యార్థులను డాక్టర్ సర్దార్ ఆహ్వానించారు. ఐసీఎం సాధనాల సాయంతో వారి పరిశోధనలను ప్రదర్శించమని ప్రోత్సహించారు. కంప్యూటేషనల్ డ్రగ్ డిస్కవరీలో విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించడం, పరిశ్రమప్రముఖ మాలిక్యులర్ మోడలింగ్ టెక్నాలజీలకు విలువైన సమాచారాన్ని అందించడం లక్ష్యంగా ఈకార్యశాలను నిర్వహిస్తున్నారు.

## శ్రీవిద్యాధరి క్షేత్రంలో మూలానక్షత్ర విశేషపూజలు

**వర్గల్, అక్టోబరు 27, ప్రభాతవార్త:**
మండలకేంద్రం వర్గల్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీవిద్యాసరస్వతి క్షేత్రంలో అమ్మవారి మూలానక్షత్రం సందర్భంగా సోమవారం వేద పండితులు విశేషపూజలు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి తెల్లవారుఝామున విశేష పంచామృతాభిషేకం, ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, చండీహోమం, లక్షపుష్పార్చన తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఏర్పాట్లు జరగగా, విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఆలయకమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలతో పాటు మహాప్రసాదం అందజేశారు.

## పార్వతీసమేత ఇంద్రేశ్వరస్వామిని దర్శించుకున్న టిజిఐఐసి చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి



పూజలు నిర్వహిస్తున్న నిర్మలాజగ్గారెడ్డి

**సదాశివపేట, అక్టోబరు 27, ప్రభాతవార్త:**
టిజిఐఐసి చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి శ్రీపార్వతీసమేత ఇంద్రేశ్వరస్వామిని సోమవారం దర్శించుకున్నారు. హిందువులకు కార్తీకమాసం ఎంతో పవిత్రమైనదని టిజిఐఐసి చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి అన్నారు. సదాశివపేట మండలం అంకెనపల్లి గ్రామశివారులోగల ఇంద్రేశ్వర ఆలయాన్ని సోమవారం ఆమె సందర్శించారు. పార్వతీసహిత ఇంద్రేశ్వరస్వామివారికి ప్రత్యేకపూజా కార్యక్రమాన్ని నిర్వహించి మంగళహారతులు ఇచ్చారు. అనంతరం స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. వారివెంట సిడిసి చైర్మన్ రామిరెడ్డి కాంగ్రెస్ నాయకుడు ఆసిరెడ్డి ఉన్నారు.

## అమ్మవారి దయతో అందరూ బాగుండాలి

**-మిట్టపల్లిలో నల్లపోచమ్మ ఆలయ విగ్రహప్రతిష్ఠాపన**



విగ్రహప్రతిష్ఠలో పాల్గొన్న అతిథులను సత్కరిస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 27, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మిట్టపల్లి సమీపంలోని మాల కమ్యూనిటీ ఆధ్వర్యంలో వెలసిన నల్లపోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేకపూజలను నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు వేలేటీ రాధాకృష్ణశర్మ, కూర మాణిక్యరెడ్డి, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, కొండం సంపత్‌రెడ్డి, జాప శ్రీకాంత్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ అమ్మవారి దయతో అందరూ బాగుండాలన్నారు. ఆలయంపక్కనే ఉన్న మహిళా డిగ్రీకళాశాల విద్యార్థులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు కనకమల్లయ్య, పిఎసిఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్, నాయకులు చంద్రకాంత్, కమలాకర్‌రావు, జెపి యాదవ్, పయ్యావుల రాములు తదితరులు పాల్గొన్నారు.

## వర్గల్‌లో నషాముక్త్ భారత్ అభియాన్



రంగోలిని పరిశీలిస్తున్న అధికారులు

**వర్గల్, అక్టోబరు 27, ప్రభాతవార్త:**
సెర్ప్, ఐసిడిఎస్ శాఖల ఆధ్వర్యంలో సోమవారం వర్గల్ మండలంలో నషాముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా రంగోలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ రంగోలి కార్యక్రమంలో నెంటూర్ క్లస్టర్‌కు చెందిన లావణ్య ప్రథమ స్థానంలో నిలువగా ఐసిడిఎస్‌కు చెందిన వినోద ద్వితీయ స్థానం, జూనియర్ కళాశాల విద్యార్థిని అలేఖ్య తృతీయ స్థానంలో నిలిచారు. ఎంపికచేసిన వీరిని జిల్లాకు పంపించడం జరుగుతుందని ఏపిఎం కిరణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రాణి, సునీత, జూనియర్ కళాశాల లైబ్రేరియన్ పద్మలత, సిసిలు నర్సింలు, సత్యం, సాయిలు, స్వామి, స్వర్ణలత, పద్మ, వసంత, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రేణుక, వివిధగ్రామాల అధ్యక్షులు శోభారాణి, భవాని, వివోఏలు లావణ్య, లత, శృతి, చిత్తరి, బ్రహ్మం, అంగన్వాడీ టీచర్లు అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలి

**-ఎసిపి సదానందం**



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎసిపి సదానందం

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 27,ప్రభాతవార్త :**
పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలో సైకిల్‌ర్యాలీని సోమవారం ఎసిపి సదానందం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు అమరులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించుకొని ఉత్సాహంగా విద్యార్థినీవిద్యార్థులు పట్టణ పురవీధుల గుండా సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఈ సైకిల్ ర్యాలీ ముఖ్య ఉద్దేశం పోలీసు అమరవీరులు చేసిన త్యాగాలను ప్రజలకు తెలియజేయాలని ఉద్దేశంతో నిర్వహించడం జరుగుతుందన్నారు. పోలీసు అమరవీరులను అనునిత్యం స్మరించుకుంటూ, నిరంతరం ప్రజలలో చిరస్మరణీయంగా ఉండాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం వలన ప్రజలలో పోలీసులకుగల సత్సంబంధాలు మెరుగుపరుచుకోవడానికి బాగా ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ సిఐ శ్రీనివాస్ ఎస్ఐ లక్ష్మారెడ్డి, విద్యార్థిని విద్యార్థులు, సైకిల్ రేసులో పాల్గొనే యువకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దు

**-రైతులను పక్కదారి పట్టిస్తున్న మిల్లు యజమానులు**
**-ప్రభుత్వం కేటాయించిన మద్దతుధరకే పత్తి కొనుగోలు చేయాలి**
**-అధికారులకు పనిచేతగాకపోతే ఇళ్లలోనే ఉండండి**
**-మిల్లు యజమానుల, అధికారుల తీరుపై మండిపడ్డ ఎంపి రఘునందన్‌రావు**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి రఘునందన్‌రావు

**గజ్వేల్, అక్టోబరు 27, ప్రభాతవార్త:**
మిల్లు యజమానులు దళారులుగా వ్యవహరిస్తున్నారని, మిల్లు బయట తమ ఏజెంట్లను పెట్టుకొని బయట ఒక రేటు లోపల ఒక రేటు అని చెబుతూ రైతులను పక్కదారి పట్టిస్తున్నట్లు మెదక్ ఎంపి రఘునందన్‌రావు మిల్లు యజమానులపై మండిపడ్డారు. సోమవారం గజ్వేల్ పట్టణ శివారులోని పిడిచెడ్ రోడ్డులోగల సాయి బాలాజీ కాటన్ ఇండస్ట్రీస్‌లో సిసిఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.
ఈ సంద ర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రైతు ఏడ్చిన రాజ్యం ఎద్దు ఏడ్చిన వ్యవసాయం ముందుకు పోలేదని, రైతులు లేనిదే రాజ్యం లేదన్నారు. రైతులకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదన్నారు. కేంద్రప్రభుత్వం కేటాయించిన మద్దతు ధర క్వింటాల్ పత్తికి రూ.8,160 ఉందని, అదేధర రైతులకు కట్టించి ఇవ్వాలన్నారు. పత్తి తేమగా ఉందని, పత్తి బాగాలేదని సాకులుచెబుతూ రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని హెచ్చరించారు. అధికారులు సైతం రైతుల పట్ల సానుకూలంగా స్పందించాలని, రైతులపై వివక్ష చూపవద్దన్నారు. మీకు చేతనైతేనే ఉద్యోగాలు చేయాలని, లేదంటే ఇంట్లో కూర్చోవాలని అన్నారు. అధికారులకు సంబంధించిన ఫోన్ నెంబర్లను బోర్డుపై పెట్టాలని మిల్లు యజమానులకు సూచించారు. పత్తి కొనుగోలు సీజన్ అయ్యేంతవరకు అధికారులు మిల్లుల వద్దనే ఉండాలన్నారు. దళారులను నమ్మి పోసపోవద్దని, దళారుల వ్యవస్థను పూర్తిగా తరిమికొట్టాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈమధ్య మిల్లు యజమానులే తమకు సంబంధించిన ఏజెంట్లను కేటాయించి రైతుల వద్ద పత్తిని తక్కువ ధరకు కొనుగోలుచేసి లాభార్జనే ధ్యేయంగా పని చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇకనుండి అలాంటి పనులు చేస్తే క్షమించబోమని, రైతులకు వెన్నంటే ఉంటూ అధికారులు తప్పనిసరిగా తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. అక్కడే ఉన్న రైతులతో ఎంపి రఘునందన్‌రావు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.8,160 మద్దతు ధర ఇస్తుందని, రైతులు ఎవరూ బయట దళారులకు పత్తిని విక్రయించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, ఏఎంసి డైరెక్టర్లు, మార్కెట్ కార్యదర్శి జాన్‌వెస్లీ, కాటన్ కార్పోరేషన్ అధికారి దుర్గాప్రసాద్, ఆత్మ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు దళారులను అశ్రయించి మోసపోవద్దు

**-మెదక్ ఎంపి రఘునందన్‌రావు**



స్వాతి మిల్లులో సిసిఐ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపి రఘునందన్‌రావు

**కొండపాక, అక్టోబరు 27, ప్రభాతవార్త**
దళారులను అశ్రయించి పత్తిరైతులు మోసపోవద్దని మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు సూచించారు. సోమవారం మండల పరిధిలోని స్వామి, మహదేవ్ పత్తి మిల్లులల్లో పత్తి కొనుగోలు కేంద్రాలను డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతుల అభివృద్ధికే పనిచేస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన పత్తి కొనుగోలు కేంద్రాల్లోనే (సిసిఐ) రైతులు పండించిన పత్తిని అమ్ముకోవాలని కోరారు. అరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో క్వింటాల్‌కు రూ.4వేలుగా ఉన్న పత్తి ధరను రూ.8వేలకు పెంచి రైతులకు లాభం చేకుర్చడం జరిగిందన్నారు. సిసిఐ కేంద్రాల వద్ద ఉన్నతధికారుల ఫోన్‌నెంబర్లను ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను అదేశించారు. రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటను దళారులు తేమశాతం పేరుతో మోసంచేసినవారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ పర్శరాములు, బిజెపి రాష్ట్ర నాయకుడు నలగామ శ్రీనివాస్, బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, కాట రమేష్, గడ్డమిది రామస్వామి పిఎసిఎస్ డైరెక్టర్ బూర్గుల సురేందర్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు వాసరి లింగారు, బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు నీల సత్యం, బిజెపి జిల్లా నాయకుడు మాజీ సర్పంచ్ బడేకోల్ నర్సింలు, తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి, కొల ఉపేందర్, రైతులు, ఆయా మిల్లుల యాజమానులు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనరీ బెనిఫిట్లు వెంటనే మంజూరు చేయాలి




కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 27, ప్రభాతవార్త :**
2024 మార్చి నెల నుంచి పదవీవిరమణ పొందిన ఉద్యోగులకు ప్రభుత్వం నేటికీ పెన్షనరీ ప్రయోజనాలు, గ్రాట్యుటీ, కమ్యూటెడ్ వ్యాల్యూ ఆఫ్ పెన్షన్, గ్రూప్‌బీమా, జిపిఎఫ్ బకాయిలు మంజూరు చేయకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా పలుడిమాండ్లతోకూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో కలెక్టర్ హైమావతికి అందజేశారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న పెన్షనరీ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. పెన్షనరీ బకాయిలు చెల్లించకపోవడంతో విశ్రాంత ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జిపిఎటి జిల్లా శాఖ అధ్యక్షులు చిల్ల నర్సింలు, ప్రధాన కార్యదర్శి రెడ్డి మధుసూదన్‌రెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు బన్సీలాల్, పరుశరాములు, శ్రీనివాస్, సత్తయ్య, అన్నమరెడ్డి, నారాయణరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ప్రభాకర్, దయానందరాజు, కృష్ణమూర్తి, హనుమంతరెడ్డి, లక్ష్మారెడ్డి, పెండల శ్రీధర్, నాగేందర్, కనకయ్య, బాలపోచయ్య, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## మర్కుక్ నూతన ఎంపిడివోగా విక్రమ్

**మర్కుక్, అక్టోబరు 27, ప్రభాతవార్త:**
మర్కుక్ మండల నూతన మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా బి.విక్రమ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎంపిడివోగా విధులు నిర్వహించిన అశోక్‌కుమార్ బదిలీపై వెళ్లగా గ్రూప్-1లో ఉద్యోగం సాధించిన విక్రమ్ మర్కుక్ ఎంపిడివోగా బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ శాఖల అధికారుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగులు ఎంపిడివో విక్రమ్‌కు ఘనంగా స్వాగతం పలికారు.

## సైకిల్ ర్యాలీ నిర్వహించిన చేర్యాల పోలీసులు



చేర్యాలలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

**చేర్యాల,అక్టోబర్ 27,ప్రభాతవార్త**
పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా చేర్యాలలో పోలీసులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థినీవిద్యార్థులతో కలిసి సిఐ శ్రీను, ఎస్సై నవీన్ పట్టణంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

**-సన్న వడ్లకు రూ.500 బోనస్ వెంటనే ఇవ్వాలి**
**-ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి**



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

**వర్గల్, అక్టోబరు 27, ప్రభాతవార్త:**
ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వర్గల్‌లో వంటిమామిడి ఏఎంసి చైర్మన్ విజయ మోహన్, పిఏసిఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, సిఈఓ జితేందర్‌రెడ్డిలతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించే పంటలు దళారులకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. గత రబీలో సన్న ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన బోనస్ ఇవ్వలేదని, ప్రస్తుత ఖరీఫ్‌లో అయినా సన్న ధాన్యాన్ని విక్రయించిన రైతులకు క్వింటాల్‌కు రూ.500చొప్పున బోనస్ వెంటనే చెల్లించాలన్నారు. అన్నదాతల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేయవద్దన్నారు. రైతులు పండించిన ప్రతి పంట కొనుగోలుకు ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. మొక్కజొన్న కొనుగోలును ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో మధ్యదళారులు ఆర్థికంగా లబ్ధిపొందినట్లు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం నిర్ధేశించిన నిబంధనల మేరకు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని అన్నారు. కాగా గ్రేడ్-ఏ రకానికి రూ.2389, గ్రేడ్-బి రకానికి రూ.2369 మద్దతు ధరను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. అలాగే పత్తి కొనుగోలుకు సిసిఐ ముందుకు వచ్చిందని, దీనిని దృష్టిలో పెట్టుకొని రైతులు తాము పండించిన పత్తిని సిసిఐ కేంద్రాలకు తరలించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, బిఆర్ఎస్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు నాగరాజు, నేతలు రమేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రాజు, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

## మరణానికి మనం కారణం కారాదు

**-ఎసిపి సదానందం...**

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 27, ప్రభాతవార్త:**
ధాన్యం రోడ్లపై పోసి ఒకరి మరణానికి మనం కారణం కారాదని హుస్నాబాద్ ఎసిపి సదానందం అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోయడంవల్ల రాత్రి సమయంలో వాహనదారులకు రోడ్డు స్పష్టంగా చూడలేక ప్రమాదాలు జరగవచ్చని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే మూడు నుంచి నాలుగు సంఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. ప్రమాదం జరిగితే బాధ్యత రైతుదే అని, రోడ్డు మీద ధాన్యం పోసి ప్రమాదం జరిగితే, సంబంధిత రైతుపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒకరి నిర్లక్ష్యం మరొకరి ప్రాణాన్ని బలి తీసుకోకూడదు. ఒకరి మరణానికి మనం కారణం కారాదని స్పష్టంచేశారు.

**-వేరే ప్రత్యామ్నాయాలు చూడండి:**
రైతులు సాధ్యమైనంతవరకు రోడ్లకు అడ్డంగా కాకుండా పక్కన ఉన్న సురక్షిత ప్రదేశాల్లోనే ధాన్యం, మక్కలు ఆరబెట్టాలని సూచించారు. ప్రతి పౌరుడు ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలు తగ్గుతాయని, అందరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

## క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

**-ఎస్ఐ లక్ష్మారెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ లక్ష్మారెడ్డి

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 27, ప్రభాతవార్త:**
విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని హుస్నాబాద్ ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం హుస్నాబాద్‌లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కాలేజ్ బెజ్జంకి హుస్నాబాద్‌లో విద్యార్థినులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్‌టచ్, బాడ్‌టచ్, సైబర్‌నేరాల గురించి షీటీమ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. విద్యార్థులు, మహిళలకు ఎలాంటి ఇబ్బంది కలిగినా 8712667434 కాల్ చేయాలని సూచించారు. మహిళల రక్షణకు ఎల్లప్పుడు షీటీమ్ అండగా ఉంటుందని తెలిపారు. అపరిచిత వ్యక్తులను నమ్మవద్దని ఈ వయసులో ప్రేమ, పెళ్లి అంటూ చెప్పేవారి మాటలు నమ్మవద్దని సూచించారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తెరిగి చదువుకోవాలని మనిషి జీవితాన్ని మార్చేది చదువు ఒక్కటేనని, చదువు ఉంటే ఎక్కడైనా బతుకుచ్చని తెలిపారు. ఇష్టపడి చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ మమత, హుస్నాబాద్ షీ టీమ్ బృందం ఎఎస్ఐ సదయ్య, మహిళ కానిస్టేబుళ్లు ప్రశాంతి, స్వప్న, కానిస్టేబుళ్లు కృష్ణ, బాబు తదితరులు పాల్గొన్నారు.

## మత్తుపదార్థాల నిర్మూలనకు సహకరించాలి

**-బస్వాపూర్‌లో ప్రజాసమస్యలను తెలుసుకున్న ఎస్ఐ అభిలాష్**



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎస్ఐ అభిలాష్

**కోహెడ, అక్టోబరు 27, ప్రభాతవార్త:**
పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఎస్ఐ అభిలాష్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని బస్వాపూర్‌లో గ్రామసభ నిర్వహించి నేరుగా ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి లాంటి మత్తుపదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మత్తుపదార్థాలు విక్రయించినా, కలిగి ఉన్నా, వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కి సమాచారం అందించాలన్నారు. ఎవరైనా ప్రమాదానికిగురైనా, బెదిరింపులకుగురైనా వెంటనే డయల్ 100కు కాల్‌చేయాలన్నారు. సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలన్నారు. గ్రామంలోని సమస్యలను తెలుసుకొని పరిష్కరించే సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించి పరిష్కారం కానీ సమస్యలను సంబంధిత శాఖల అధికారులకు నివేధించి సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. ఆయనవెంట పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో 29న చలో కలెక్టరేట్

**కొమురవెల్లి, అక్టోబరు 27, ప్రభాతవార్త:**
పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్వి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 29న హలో విద్యార్థి చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నట్లు బిఆర్ఎస్వి సీనియర్ నాయకులు ఏర్పుల మహేష్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి 22 నెలలు గడుస్తున్నా విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడం లేదన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంటు బకాయిలను చెల్లించడంలో విద్యాశాఖను చూస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయకుండా సిఎం రేవంత్‌రెడ్డి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని తెలిపారు. 29న నిర్వహించే హలో విద్యార్థి చలో కలెక్టరేట్‌కు విద్యార్థులు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## డ్రగ్స్‌రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న అధికారులు

**నంగునూర్, అక్టోబరు 27, ప్రభాతవార్త:**
డ్రగ్స్‌రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ మాధవి, ఎపిఎం శ్రీనివాస్‌లు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని నంగునూర్ ఐకెపి కార్యాలయం ఆవరణలో నషాముక్త్‌భారత్ అభియాన్ అవగాహన కార్యక్రమంలోభాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులచే ముగ్గుల పోటీలు నిర్వహించి అవగాహన కల్పించి ప్రతిజ్ఞచేయించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై డ్రగ్స్‌రహిత సమాజాన్ని నిర్మించాలన్నారు. ఏ ఒక్కరూ డ్రగ్స్‌బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు చేసేవ్యక్తుల సమాచారం తెలిస్తే సంబంధితశాఖ అధికారులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కోల రమేష్‌గౌడ్, ఎల్లంకి మైపాల్‌రెడ్డి, సిసిలు శ్రీనివాస్, పంగ లింగం, మల్లేశం, ప్రేమలత, సేనాపతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఐకెపి వివోఏలు, మహిళాసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

